క్లుప్తంగా

కానూరులో విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీ



పెనమలూరు: కానూరు సెక్షన్‌లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు వివరాలు తెలుపుతూ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు 37 బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీల్లో 120 కేసులు నమోదు చేసి వారి వద్ద రూ 4.36 లక్షలు అపరాధ రుసుం విధించామన్నారు. విద్యుత్ లోడ్‌తో పాటు ఒక క్యాటగిరీ నుంచి మరో క్యాటగిరీకి వాడుతున్న సర్వీసులను గుర్తించామన్నారు. తక్కువ బిల్లులు అవుతున్న సర్వీసులను గుర్తించి క్రమబద్ధీకరించడానికి నోటీసులు జారీ చేశామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈ బి.నవీన్ కుమార్ డివిజన్‌లోని లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్ల విధులు, బాధ్యతలను వివరించారు. ఫీల్డ్‌లో లైన్లపై పని చేసే సిబ్బందికి భద్రతపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఈఈ పి.విజయకుమారి, కానూరు ఏఈ వంశీకృష్ణ, విజిలెన్స్ ఏఈలు, డీఈలు, గుణదల డివిజన్ ఏడీఈలు ,సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి



గన్నవరం రూరల్: గ్రామాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులను నిర్ణీత కాలంలో తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆరోగ్య శాఖ ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. సోమవారం మండలంలోని కొత్తగూడెంలో ఉన్న తాగునీటి ట్యాంకులు, బోర్లు పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రవికాంత్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ట్యాంకులను కడిగిన తర్వాత తప్పక క్లోరినేషన్ చేయాలని, రిజిస్టర్లు నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఏ తేదీలో ట్యాంకులు శుభ్రం చేయాలో ప్రదర్శించాలని తెలిపారు. గ్రామంలో పర్యటించి పైప్‌లైన్ లీకేజీలు పరిశీలించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని వినియోగించుకోండి



పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి అన్నారు. కానూరు మురళీనగర్‌లో సోమవారం అంగన్‌వాడీ బాట పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రీస్కూల్‌కు వచ్చే చిన్నారులకు అందించే సదుపాయాలను వివరించారు. ప్రీస్కూల్ చిన్నారులకు బోధించే నవచేతన, ఆధార్ శాల, ఆటపాటల వివరాలు తెలిపారు. అంగన్‌వాడీలో చిన్నారులు చేరడంతో పోషకాహారం, ఆరోగ్యం కోసం వైద్య సేవలు, విద్యాబోధన ఇలా అనేక పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు ముందే మరమ్మతులు చేయాలి



బుద్ధవరం(గన్నవరం): ఖరీఫ్‌కు ముందే కాలువల మరమ్మతులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. మండలంలోని బుద్ధవరం పరిధిలో ఏలూరు కాలువ, ఉంగుటూరు బ్రాంచ్ కెనాల్ మరమ్మతులను సోమవారం ఆయన పరిశీలించారు. యార్లగడ్డ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు చివరిభూములకు కూడా సాగునీరు అందించడానికి కాలువలు మరమ్మతులు చేయాలని తెలిపారు. ఏలూరు కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న గుర్రపుడెక్క, తూటుకాడను పూర్తిగా తొలగించాలని సూచించారు. నీటి సంఘాల అధ్యక్షులు, డీసీ చైర్మన్లు మరమ్మతులను దగ్గరుండి పర్యవేక్షించాలని తెలిపారు.

నిరంతర కృషితో లక్ష్య సాధన

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిరంతర కృషి, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని సాయిమేధ శిక్షణ సంస్థల చైర్మన్ జి. రమణ అన్నారు. డిప్లమో అనంతరం ఈసెట్ ద్వారా ఇంజినీరింగులో ప్రవేశం పొందడంపై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రమణ, విజయవాడ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ సదస్సులో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు.

గ్రామకంతం అన్యాక్రాంతం!

- గండిగుంటలో తప్పుడు సర్వే నంబర్‌తో వీలునామా, ఆపై రిజిస్ట్రేషన్
- రూ.50 లక్షలు విలువ చేసే గ్రామకంతం కబ్జా
- చక్కబెట్టే పనిలో కూటమి నేతలు



గండిగుంట నడిబొడ్డున అన్యాక్రాంతమైన గ్రామకంతం భూమి

ఉయ్యూరు/ఉయ్యూరు రూరల్: గండిగుంటలో గ్రామ కంఠం అన్యాక్రాంతమైంది. రూ.50 లక్షలు విలువ చేసే భూమిని పచ్చచొక్కా నేతల అండదండలతో వీలునామా సృష్టించి ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. పంచాయతీ అధికారుల అండదండలతో ఆస్తి పన్ను సంపాదించి స్థలాన్ని హస్తగతం చేసుకునేందుకు చక్రం తిప్పాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే..

మండలంలోని గండిగుంట గ్రామ పరిధిలో 1072 సర్వే నంబరులో సుమారు 22 ఎకరాలు గ్రామకంతం భూమిగా ఉంది. ఇందులో ప్రధాన కూడలిలోని కోదండ రామాలయం సమీపంలో దాదాపు 10 సెంట్ల భూమి పంచాయతీకి సంబంధించింది.

ముక్కామల నిర్మలాదేవి తన పూర్వార్జిత ఆస్తిగా నమోదు చేసి వీలునామా రాసి 1072/1 సర్వే నంబరుతో 28.8.2024న ఉయ్యూరు సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ స్థలానికి సమీపంలో ఉన్న ఇంటి నంబరు 1-40తో గ్రామ కంతానికి చెందిన స్థలానికి నిర్మలాదేవి కుమారుడు షాయోజీరావు పేరుతో ఆస్తి పన్ను పొందారు.

కూటమి ప్రభుత్వం రాగానే

గ్రామ పంచాయతీకి సంబంధించిన భూమిపై మొదటి నుంచి టీడీపీ నేతల కన్ను ఉంది. ఇక్కడే ఆ పార్టీ శ్రేణులు అంతా కూర్చోవడం, పార్టీలు చేసుకోవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ భూమిని తమ అడ్డాగా మార్చుకుని వ్యవహారాలు నడపడం పైనా గ్రామంలోని కొందరు విముఖత వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో.. వీలునామా సృష్టించి స్థలాన్ని కాజేయాలనే కుట్రలు పన్నడంతో అప్పట్లో ఈ యత్నాలను కొందరు స్థానికులు అడ్డుకోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ అండదండలతో గుట్టుచప్పుడు కాకుండా నోటీసులు పొంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పంచాయతీ భూమిపై ఎలాంటి చర్యలూ వద్దు.. యథాస్థితిగా ఉంచాలని కోర్టు ఉత్తర్వులు రావటంతో ఆ భూమి అలానే ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా నిలిచింది.

విచారణ చేసి చర్యలు

గ్రామకంతం అన్యాక్రాంతం అంశం మా దృష్టికి వచ్చింది. భూమిని తప్పుడు సర్వే నంబరు, వీలునామాతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదు అందింది. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించాం.

-ఎం.సురేష్‌కుమార్, తహసీల్దార్

తమ్ముళ్ల భూ కబ్జా వ్యూహం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ్ముళ్లు భూ కబ్జాకు వ్యూహం రచించారు. అధికారులను ప్రలోభపెట్టి ఆ సర్వే నంబరులో ఉన్న ఇంటిని, ఇంటి పన్నును చూపుతూ తప్పుడు వీలునామాతో 1072/1 సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూడటంతో గ్రామంలోనూ, అధికారిక వర్గాల్లో చర్చ జరగడంతో చక్కదిద్దేందుకు ఉపక్రమించారు.

నోటీసు ఇస్తున్నాం

పంచాయతీ భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ వ్యక్తికి నోటీసు ఇస్తున్నాం. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉంటే చూపించాలని పేర్కొన్నాం. రిజిస్టర్ వీలునామా ప్రకారం ఇంటి పన్ను విధించారని, పరిశీలించి చర్యలు తీసుకుంటాం. విచారణలో ప్రభుత్వ భూమి అని తేలితే స్వాధీనపర్చుకుంటాం.

-శ్రీకుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి

కాజేసేందుకే కుట్ర

గ్రామ కంతం అన్యాక్రాంతం వ్యవహారం కొత్త మలుపు తిరుగుతోంది. వీలునామా రాసింది మొదలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వరకూ నడిపిన మధ్యవర్తులే అన్యాక్రాంతం ఘటనపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీకుమార్‌కు ఫిర్యాదు ఇవ్వటం జరగబోయే తతంగానికి బలం చేకూరుస్తోంది. అధికారులు ఈ వ్యవహారం నుంచి బయట పడేందుకు, దండమూడి వెంకట్రావ్ అనే మధ్యవర్తితో ఫిర్యాదు చేయించారు. ఫిర్యాదుపై గ్రామ పంచాయతీ నోటీసు జారీ చేసి తదుపరి కోర్టును ఆశ్రయించేలా కూటమి నేతల సూచనలతో అధికారులే కథ నడిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే గ్రామ కంతం భూమిపై పలు మార్లు వివాదాలు చోటుచేసుకోవటం తెలిసిందే.

మట్టి అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే

జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి

గన్నవరం: నియోజకవర్గంలోని చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రోత్సహిస్తున్నారని గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తట్ట మట్టి కూడా బయటకు వెళ్లనీయనని ప్రగల్భాలు పలికిన యార్లగడ్డ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. గ్రామాల్లో కూటమి నేతలు చెరువులను ఇష్టరాజ్యంగా తవ్వేసి మట్టిని ఇబ్బడి ముబ్బడిగా బయటకు తరలిస్తూ కోట్లాది రూపాయిలు దండుకుంటున్నారని ఆరోపించారు. గతంలో వంశీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మట్టి తవ్వకాలపై తప్పుడు ఆరోపణలు చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు జరిగే తవ్వకాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పలు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 10వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.బసవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ కంకిపాడు సచివాలయం, 10, 11 తేదీల్లో మద్దూరు సచివాలయం, 12, 13 తేదీల్లో ఈడుపుగల్లు సచివాలయంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరుగుతాయన్నారు. 0 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను వినియోగించుకోవాలని కోరారు.

నిత్యం యోగాతో ఆరోగ్యం



దావాజిగూడెంలో జరిగిన ర్యాలీలో సర్పంచి, ఈవో



కానూరులో అవగాహన ర్యాలీ

దావాజిగూడెం(గన్నవరం): దావాజిగూడెంలో ఉన్న పామర్తినగర్‌లో సోమవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యాన యోగాంధ్ర ర్యాలీ చేశారు. తొలుత ర్యాలీని సర్పంచి బడుగు బాలమ్మ, పంచాయతీ కార్యదర్శి సరోజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలని చెప్పారు. ఈ దిశగా ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రచార ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ప్రజలందరూ జయప్రదం చేయాలని కోరారు. పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ రామారావు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రలో పాల్గొనండి

పెనమలూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్రలో అందరు పాల్గొనాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ పి.భవానీప్రసాద్ అన్నారు. కానూరులో బందరురోడ్డుపై సోమవారం కమిషనర్ ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ యోగా చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టి యోగా చేయాలని సూచించారు. యోగాంధ్రలో పాల్గొనే వారు ఆయా సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లోనే యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, వాకర్లు, స్థానికులు పాల్గొన్నారు.

కంకిపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈడుపుగల్లు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. యోగాడే అందరూ పాల్గొనాలని అతిథులు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు నిలిపివేత

కంకిపాడు: మండలంలోని మద్దూరు ఏటిపాయలో ఇసుక తవ్వకాలు నిలుపు చేస్తున్నట్లు తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ రాష్ట్రంలో రుతుపవనాల కాలం జూన్ 1 నుంచి అక్టోబరు 15వరకూ అని తెలిపిందన్నారు. ఈ కారణంగా ఇసుక మైనింగ్ కార్యకలాపాలను, తవ్వకాల నిర్వహణ, నియమాలు 2016 ప్రకారం రద్దు చేశామన్నారు. కృష్ణానదిలో ఎలాంటి ఇసుక తవ్వకాలు జరపరాదని మైనింగ్ శాఖ నోటీసు దృష్ట్యా మద్దూరు పరిధిలో కృష్ణానది ఏటిపాయలో ఇసుక తవ్వకాలు జరపకూడదన్నారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

నాటారు.. వదిలేశారు..



గన్నవరంలో గాలులకు విరిగిపోయిన ఫాక్స్‌టైల్ మొక్క



నీరులేక ఎండిపోయిన మొక్క




రోడ్డుపై పడిపోయిన మొక్క

గన్నవరం: వనమహోత్సవం సందర్భంగా స్థానిక చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై నాటిన మొక్కల పరిస్థితి మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఈ నెల 5న స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద జాతీయ రహదారి సెంట్రల్ డివైడర్‌పై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఫాక్స్‌టైల్ మొక్కలు నాటారు. సుమారు పది అడుగులపైన ఉండే ఫాక్స్‌టైల్ మొక్కలను ఒక్కొక్కటి రూ. 1,400కు గ్రామపంచాయతీ నిధులతో కొనుగోలు చేశారు. వీటిలో విజయవాడ వెళ్లే రూటులో నాటిన మూడు మొక్కలు ఇటీవల వీచిన భారీ గాలులకు సగానికి విరిగిపోయి నెలకొరిగాయి. ఏలూరు రూట్‌లో నాటకుండానే సెంట్రల్ డివైడర్‌లో పెట్టి గాలికి వదిలేశారు. వీటిలో మరో కొన్ని మొక్కలు విరిగిపోవడం, నీరు లేక అధిక ఉష్ణోగ్రతలకు ఎండిపోవడం, మరికొన్ని రోడ్డుపై పడి వాహనాలు తొక్కివేయడంతో పాడైపోతున్నాయి. ప్రజాధనంతో అధిక ఖరీదుతో కొనుగోలు చేసిన మొక్కల విషయంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎదురుచూపులే.. సాయమందేదెప్పుడో!

- రైతులకు తప్పని సాగు కష్టాలు
- ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ పనులు ప్రారంభం
- చేతికందని ఆర్థిక సాయం



రూరల్ మండలంలో దుక్కులు దున్నుతున్న రైతులు

విజయవాడరూరల్: అన్నదాత ఎదురుచూస్తున్నాడుగానీ.. సాయం మాత్రం అందడం లేదు. భూమినే నమ్ముకున్న రైతన్నలకు కష్టాలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంవత్సరానికి రూ.20 వేలను వ్యవసాయ పంటల సాగుకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి ఏడాదైనా రైతులను పట్టించుకోవడం లేదనే విమర్శిస్తున్నారు. అందలమెక్కిన తర్వాత పాలకులు రైతులకు సాయం చేయడాన్ని విస్మరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా రూ.13, 500 ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమయ్యేది. పెట్టుబడి సాయాన్ని ముందుగానే అందించడంతో ఆనందంతో వ్యవసాయ పనులు చేసేవారు.

సాగుకు సిద్ధమవుతున్నా..

రుతుపవనాలు వచ్చాయి.. మృగశిర కార్తె వచ్చి రైతులు పొలాల్లో ఖరీఫ్ సీజన్ దుక్కులు దున్నుతూ సాగుకు సిద్ధమవుతున్నారు. అయినా ఇంతవరకు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించలేదు. రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్పు చేసిందే తప్ప మార్గదర్శకాలు విడుదల చేయలేదు. గత ప్రభుత్వంలో విజయవాడరూరల్ మండలంలో ఏటా 12,400 మంది రైతులకు పెట్టుబడి సాయం అందింది. ఇలా గడిచిన ఐదేళ్ల పాటు రైతులకు పెట్టుబడి సాయం అందించింది. అయితే కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అంటూ కసరత్తు చేస్తోందిగానీ అర్హులను తేల్చడం లేదు. అయితే రైతులు మాత్రం పెట్టుబడి సాయం కోసం వెయ్యికన్నులతో ఎదురు చూస్తున్నారు.

ఎప్పుడిస్తారో



గతంలో వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందే మే నెలలోనే రైతు భరోసా నగదును బ్యాంక్ ఖాతాలో జమచేసేవారు. ప్రస్తుతం ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. ఎవరిని అడిగినా ఇంకా పై నుంచి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు.

-సొంగా దయాకర్, అంబాపురం

హామీలను తక్షణమే అమలు చేయాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. పేద, మధ్యతరగతి రైతులు కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. నమ్మి ఓట్లు వేసిన రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఇస్తానని చెప్పిన రూ. 20 వేలు అందజేయాలి.

-కలకోటి శ్రీనివాసరెడ్డి, మండల రైతు సంఘం కన్వీనర్

గురుకుల విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ తదితరులు

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను సోమవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మచిలీపట్నం జిల్లా పరిషత్ హాల్‌లో అభినందించారు. సీనియర్ బైపీసీ విద్యార్థిని ఎస్.ఇందు 1000 మార్కులకు 980, 10వ తరగతి పి.శృతి 600 మార్కులకు గాను 527 సాధించారని ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. అత్యుత్తమ మార్కులతో రాణించిన వారిని కలెక్టర్ అభినందిస్తూ మెరిటోరియస్ సర్టిఫికెట్, మెడల్ షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డ్స్ అందజేసి సత్కరించారు. ఒక్కొక్కరికీ రూ.20వేలు క్యాష్ రివార్డు అందజేశారు. చదువులో మరింతగా రాణించి ఉన్నత స్థానాలు సాధించాలని కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు.

సర్వమత సమానత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



విజయవాడ కల్చరల్: సర్వమత సమానత్వానికి ప్రతీక ఛత్రపతి మహారాజ్ అని తాళ్ళాయ పాలెం శైవపీఠాధిపతి శివస్వామి అన్నారు. ఛత్రపతి శివాజీ స్మారక సమితి ఆధ్వర్యంలో బీఆఆర్‌టీఎస్ రోడ్డులోని జగద్గురు ఆదిశంకరా సర్కిల్‌లో హిందూ సామ్రాజ్యదినోత్సవాన్ని నిర్వహించారు. శివస్వామి మాట్లాడుతూ హిందూ ధర్మరక్షకు ప్రాధాన్యతనిస్తూనే శివాజీ మహారాజ్ అన్ని మతాలను గౌరవించేవారన్నారు. భారత దేశ చరిత్ర గతిని మార్చిన మహానీయుడు ఛత్రపతి శివాజీ అని అభివర్ణించారు. భారతీయ జనతాపార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం మాట్లాడుతూ హిందూ ధర్మరక్షణకు కృషి చేసినట్లు తెలిపారు. శివాజీ పాలనను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అవ్వారి బుల్లెబ్బాయి, బోడ్డు నాగలక్ష్మి, అవుటపల్లి శివప్రసాద్, పీ రాఘవరాజు, బొమ్మదేవర రత్నకుమారి, రవితేజ శ్రీనివాస్.పద్మజ, దర్భాశంకర నారాయణ, రాము, నరేంద్ర పాల్గొన్నారు.

మద్దూరు కరకట్టపై రోడ్డు బురదమయంగా మారిన దృశ్యం



ఏటిపాయ నుంచి రోడ్డుపైకి వస్తున్న లారీలు



రోడ్డంతా బురదమయం

రోడ్డంతా బురదమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. మద్దూరు వద్ద ఏటిపాయ నుంచి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలు ఇసుక లోడుతో కరకట్టపైకి చేరుతున్నాయి. ఆ వాహనాల నుంచి వచ్చే బురద కరకట్టపై పేరుకుపోయి, ఇసుకలో వచ్చే నీరు పడి మరింత అధ్వానంగా మారింది. విజయవాడ-అవనిగడ్డ మార్గంలో వాహనచోదకులు ఈ బురదతో నానా అగచాట్లు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు తరచూ జారిపడి గాయపడుతున్నారు. అధ్వానంగా మారిన రోడ్డు మీ ప్రయాణం అంటేనే హడలిపోతున్నారంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి బురద సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

-కంకిపాడు

విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

గుడ్లవల్లేరు: విద్యా హక్కు చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సీసీఆర్) జిల్లా కమిటీ సభ్యులు పి.సురేష్, కె.అలెగ్జాండర్, సాయిరామ్ కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వోకు వినతిపత్రం అందించామన్నారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లతో పేదలకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు.